రెండేళ్లు.. రంగుమారిన నీళ్లు

- తిలక్‌నగర్‌లో కలుషిత నీటి సరఫరా
- రోగాలబారిన స్థానికులు
- పట్టించుకోని జలమండలి అధికారులు



కలుషిత నీటితో నిరసన తెలుపుతున్న తిలక్‌నగర్ బస్తీ వాసులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధి తిలక్‌నగర్‌లో కలుషిత నీటి సరఫరా కలకలం రేపుతోంది. సుమారు యాభై ఇళ్లల్లో గత రెండేళ్లకు పైగా ఇదే దుస్థితి. కుళాయి నీటిలో రంగుమారిన నీళ్లు వస్తున్నాయని పలుమార్లు జలమండలి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే బస్తీకి వచ్చి పరిశీలిస్తారని శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బస్తీలోని ఇంటి నంబర్ 2-2-1107/19 సమీపంలో మ్యాన్‌హోల్ వద్ద పైపుల్లో లీకేజీ ఏర్పడి నీరు కలుషితమవుతోందని గుర్తించారు. నూతన పైపులైన్ వేయించేందుకు ఆ ప్రాంతంలో తవ్వి చూడగా అక్కడ ఓ పెద్ద బండరాయి అడ్డుగా ఉన్నం. ఆ బండ రాయిని తొలగించాలంటే అదనపు నిధులు కావాలని, అందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని ఓ అధికారి చెప్పారు. దీంతో గత నెల(ఏప్రిల్) 22న బస్తీ పెద్దలు డీడీ కాలనీలోని డీజీఎం విష్ణువర్ధన్ రావును కలిసి కలుషిత నీటి సమస్యను వివరిస్తూ, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రంగుమారిన నీటిని చూపుతున్న బస్తీ వాసుడు

కన్నెత్తి చూడని ప్రజా ప్రతినిధులు..

తిలక్‌నగర్ బస్తీలో అధిక శాతం దళితులే నివాసముంటున్నారని ఆ బస్తీ కలుషిత నీటితో ఇబ్బందులు పడుతుంటే ప్రజా ప్రతినిధులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో నిత్యం బస్తీలో ఇంటింటికి తిరిగిన నాయకులు గెలిచిన తర్వాత బస్తీ సమస్యలు పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దళిత బస్తీ అంటే అంత చులక భావం వీడాలని స్థానికులు అంటున్నారు.కుళాయిల ద్వారా సరఫరా అయిన నీటిని బాటిళ్లలో నింపి వాటితో బస్తీ వాసులు లక్ష్మిబాయి, లలిత, యశోద, సత్యమ్మ, బలరామ్, శ్రీనివాస్, ఆనంద్, రవి, కళ్యాణ్ ఇటీవల ఈ వీధిలో నిరసన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు స్పందించి బస్తీలో నూతన సీవరేజీ పైపులైను వేయించి కలుషిత నీటి సమస్యకు చెక్ పెట్టాలని బస్తీ వాసులు కోరుతున్నారు. రెండేళ్లకు పైగా కుళాయిల నుంచి మురుగు నీరు సరఫరా అవుతోంది. వాసన వచ్చే నీటిని ఎలా వాడాలి. ఎవరూ పట్టించుకోరు. నిత్యం డబ్బు పెట్టి ఫిల్టర్ నీరు కొనుక్కుని తాగుతున్నామని వాపోతున్నారు. ఈ విషయమై ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోతుందని వాపోతున్నారు. కనీసం ట్యాంకర్లతో అయినా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..



గత రెండేళ్ల నుంచి బస్తీలో కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఇరుకైన వీధిలో బండరాయి ఉందని, అది తొలగించిన నూతన పైపులైన్ వేస్తే కలుషిత నీటి సమస్యకు శ్వాత పరిష్కారం లభిస్తుందని అందుకు అదనపు నిధులు అవసరమని, దానికి ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. దళితులమన్న భావనతో ప్రజా ప్రతినిధులు తమ బస్తీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఉన్నతాధికారులు స్పందించిన కలుషిత నీటికి చెక్ పెట్టాలి.

– బత్తిని రవి, తిలక్‌నగర్ నవశక్తి యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ సిద్దిక్‌నగర్, బంగ్లాదేశ్ మార్కెట్ వీధిలో డ్రైనేజీ పైపులైన్ అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. బంగ్లాదేశ్ మార్కెట్ వీధి, సిద్దిక్ నగర్, సందాని వీధీలో డ్రైనేజీ పైపులైన్లు అస్తవ్యస్తంగా మారడంతో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ రూ. 10.50 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మసూద్, జఫర్‌ఉద్దీన్, ఉస్మాన్, ఖైరత్ అలీబాబా, సోఫీన్ ముజీద్ , షారుకాన్, ఉస్మాన్, మజీర్ అలీ పాల్గొన్నారు.

ఘనంగా నృసింహస్వామి జయంతి



జయంతి వేడుకలను నిర్వహిస్తున్న పండితులు

కాచిగూడ: శ్రీ నృసింహస్వామి జయంతి సందర్భంగా శనివారం కాచిగూడ, లింగంపల్లిలోని ఉత్తరాది మఠంలో స్వామి వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృసింహ హోమం, అనంతరం కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మఠం అధికారి జయతీర్థచార్యులు, పండితులు శ్రీనివాస్, అమిత్, కె.గీతామూర్తి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా కాంగ్రెస్ నేతలు ర్యాలీ శనివారం అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ వి.హనుమంతారావు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్‌ఖాన్, ముజీహీద్ ఖాన్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, శంభుల ఉషా శ్రీకాంత్‌గౌడ్, దిడ్డి రాంబాబు, హరినాథ్‌రెడ్డి, లక్‌పతి యాదగిరి గౌడ్, పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు స్వీయక్రమశిక్షణ అవసరం



సివిల్స్ అభ్యర్థులకు సూచనలిస్తున్న చేతనరెడ్డి

చిక్కడపల్లి: సివిల్స్ అభ్యర్థులకు ప్రణాళిక, స్వీయ క్రమశిక్షణ చాలా అవసరమని ఆల్ ఇండియా సివిల్స్ 110 ర్యాంకర్ ఎస్.చేతనరెడ్డి సూచించారు. సివిల్స్‌కు సిద్ధమవుతున్న వారికి శనివారం ఆర్టీసీక్రాస్ రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. అంకిత భావం, వ్యూహాత్మక సంసిద్ధత, ప్రజా సేవ పట్ల లోతైన నిబద్ధత అవసరమన్నారు.

నాగయ్యకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగయ్య

కవాడిగూడ: కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న నాగయ్యకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జాగ్రఫీ నాగయ్యకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. శనివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగయ్య మాట్లాడుతూ.. వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ ఇన్ తెలంగాణ రీజియన్ స్టడీ ఆఫ్ రంగారెడ్డి డిస్టిక్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.

మహిళా నేతల అరెస్ట్ సబబు కాదు

ఉస్మానియా యూనివర్సిటీ: అందాల పోటీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన మహిళాతల అరెస్ట్ పై జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగేశ్వర్‌రావు, సుమంత్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలను రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలను పోలీసులు అత్యుత్సాహంతో బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యను అరెస్ట్ చేసిన పద్ధతి అమానుషం అన్నారు.

తెలంగాణలో ఐఐటీ, ఐఐఎంల ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ఐఐటీ, ఐఐఎంలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించినట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ చనగాని దయాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఐఐటీలో సీట్ల సంఖ్యను 590కి పెంచాలని, నూతన ఐఐటీ, ఐఐఎంలను నెలకొల్పే దిశగా కేంద్రం ప్రభుత్వం ఆలోచించాలని కోరినట్లు తెలిపారు.

ఆదివాసీల ప్రాణాలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం శాంతి చర్చలను కొనసాగించాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అణచివేతతో రాజ్యం ఏలుతుందని విమర్శించారు. ఎన్‌కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. మావోయిస్టుల పేరుతో దేశవ్యాప్తంగా సాగుతున్న ఎన్‌కౌంటర్ల హత్యకాండా పథక స్థాయికి చేరిందన్నారు. బందించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. సంఘీభావ వేదిక నాయకులు పి. నారాయణ మాట్లాడుతూ.. ఆదివాసీ మూలవాసులపై ప్రభుత్వం సీతకన్ను పెడుతుందన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కాల్చి చంపే హక్కు లేదన్నారు. వెంటనే బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి ఆదివాసీల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్ , వివిధ సంఘాల నాయకులు అనిల్, విజయ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి యువకుడు సైనికుడు కావాలి



నినాదాలు చేస్తున్న యువత

కాచిగూడ: దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో దేశం కోసం ప్రతి యువకుడు ఒక సైనికుడు కావాలని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ యూసీసీ సభ్యులు, యువనేత కాలపురెడ్డి సాయిబాబా పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి, భారత సైన్యానికి శనివారం కాలపురెడ్డి సాయిబాబా నేతృత్వంలో యువత మద్దతు తెలిపారు. మనకోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడుతున్నా సైన్యానికి దేశ ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజలందరూ ఐక్యతను చాటాలని అన్నారు. కార్యక్రమంలో రాజేష్, శ్రీనివాస్, వేణు, జనార్ధన్, కృష్ణ, సత్యం, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: ప్రజాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్‌లో రూ.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పను శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి పనులు చేపట్టడడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విముక్తికి అక్షరాలను ఆయుధంగా మార్చిన వనిత మిడ్కో



అరుణతార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: స్త్రీ విముక్తి కోసం తన అక్షరాలను ఆయుధంగా చేసిన గొప్ప వీర వనిత మిడ్కో అని వక్తలు కొనియడారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో విప్లవ యోధురాలు మిడ్కో సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మిడ్కో పై వచ్చిన అరుణతార ప్రత్యేక సంచికను మిడ్కో తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మీ , ప్రముఖ రచయిత ఏకె ప్రభాకర్, అనురాధ మాట్లాడుతూ.. తన లాంటి కోట్లాది మహిళల సంఘర్షణ , పోరాటాన్ని కథలుగా మలిచిందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎంచుకున్న దారిని కడదాకా విడవని ధీరవనిత అని కొనియడారు.మహిళల జీవితాలలో వెలుగు నింపడానికి పోరాటమే సరైన మార్గమని గుర్తించిందని అన్నారు. మిడ్కో కథ రాచయితగా, పీపుల్స్ జర్నలిస్టుగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. దండకారణ్యంలో ఆదివాసీలపై కొనసాగుతున్న మారణఖండాను బయటి సమాజానికి చేరవేసిన మిడ్కో సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. విప్లవ రచయితల సంఘం నాయకులు శివరాత్రి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాయమ్మ కరుణ, భజరా,జగదీశ్వర రావు పాల్గొన్నారు.

రైల్లో ఫోన్‌చోరీ

కాచిగూడ: హజ్రత్ నిజాముద్దీన్ నుంచి కాచిగూడకు ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ శివాని సెల్ ఫోన్‌తో పాటు, ఐడీ కార్డు చోరీకి గురయ్యాయి. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం ... రైల్లో సెల్‌ఫోన్‌ను ఛార్జింగ్ పెట్టి నాగ్‌పూర్ రైల్వే స్టేషన్ తర్వాత చూసుకునే సరికి కనిపించకపోవడంతో శివాని శనివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం వార్ధా రైల్వే పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు



మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: గత కొంత కాలంగా బర్కత్‌పుర ఆర్టీసీ డిపో రోడ్డులో వర్షపునీటి మ్యాన్‌హోల్ పూర్తిగా కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగ స్పందించిన కార్పొరేటర్ శనివారం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో మాట్లాడి మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయించారు. వర్షాకాలం వస్తుండటంతో వర్షపు నీటి మోరీలు సక్రమంగా వెళ్లే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేష్ యాదవ్, ఎం.నర్సింగ్‌రావు, బల్వీర్, బి.భీమ్‌రాజ్, వాసు, నరేందర్, ఎస్. రవియాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్యకర్తలను విడుదల చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అందాల పోటీలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న మహిళా కార్యకర్తలను అరెస్ట్ చేయడం సరికాదని వెంటనే వారిని విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్, ఎన్. నారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో మహిళలను అక్రమంగా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగడం బాధాకరమన్నారు. ఓ వైపు దేశంలో యుద్ధ మేఘాలు కమ్ముకొని ప్రజలు ఆందోళనకు గురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం పద్ధతి కాదన్నారు. ఒక వైపు ఖజానా దివాల తీసిందని చెబుతూనే మరోవైపు రూ.200 కోట్లు అందాల పోటీల నిర్వహణకు కేటాయించడం సరికాదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉత్తరా సెంటర్ ఫర్ పర్ఫార్మింగ్ ఆర్ట్ సంస్థ రజతోత్సవాలు రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు గీతా గణేషన్, ఆర్.హరిశంకర్ తెలిపారు. శనివారం చిక్కడపల్లిలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన యువ కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినినటులు తనికెళ్లభరణి, డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, గౌరవ అతిథులుగా డాక్టర్ మామిడి హరికృష్ణ, నృత్య గురువు మంజులా రామస్వామి, వినయ్ వర్మ పాల్గొంటారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతా గణేషన్, ఆర్.హరిశంకర్

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

అంబర్‌పేట: పారిశుద్ధ్య సేవలు అందించడం ఎంతో సేవాభావమని అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డి నగర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు నవీన్‌రెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాలుగా చెన్నారెడ్డినగర్‌లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న లక్ష్మీ, యాదయ్యకు శనివారం ఘనంగా సత్కరించారు. బస్తీలు, కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణానికి పారిశుద్ధ్య పనులు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు లక్ష్మయ్య, మల్లారెడ్డి, బీరయ్య, భగవంతు, రాజు, యాదయ్య, వెంకటస్వామిగౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

కాచిగూడ ఏసీపీగా హరీష్ కుమార్



హరీష్ కుమార్

కాచిగూడ: సీసీఎస్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేస్తున్న వై.హరీష్ కుమార్ శనివారం కాచిగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాచిగూడ, అంబర్‌పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి పి. నారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కేంద్ర చట్టం 1996, అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979, కాంట్రాక్టు కార్మికుల చట్టం 1970 ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్మికులందరికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 2009లో నమోదు చేసుకున్నా కార్మికుల వెల్ఫేర్ బోర్డు కార్డులను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు హన్మేష్, జి. అనురాధ, కోటం రాములు, వంగూరి రాములు, కె.ఐలయ్య పాల్గొన్నారు.